**కథ**

— పాలపర్తి ధనరాజ్

# ప్రొద్దుగుంకిన పడమరలు!



"వెంకట్రామయ్య" కయ్యిమని వినిపించింది లోపల్నుంచి ఓ స్వరం. అది శేషగిరిది. మరో రెండుసార్లు మళ్ళీ కర్కశంగా అరిచింది అదే కంఠం.

"వస్తున్నానండీ" తనలో తనే గొణుక్కున్నట్టు వరండాలో వున్న బెంచీ మీద నుంచి కదిలిందో ఆకారం. అడుగులో అడుగు వేసుకుంటూ, చేతి కర్ర సాయంతో లోపలికి అడుగు పెట్టాడు వెంకట్రామయ్య.

"పిలిచేరాండీ" వినయంగా అన్నాడు. ముసలితనంవల్ల గొంతు వణుకుతోంది.

"ఏం 'పిలిచేరాండీ' అంటూ దీర్ఘాలు తీస్తున్నావు! తలుపు లోపలికి రప్పించడానికి ఈ కబురు కాక, ఇంకేదైనా సామగ్రి కావాలేంటి?" దాదాపు మనిషి మీద పడ్డట్టు అరిచాడు శేషగిరి.

"పెద్దతనం కదండీ, సరిగా వినిపించలేదు" గొణిగాడు వెంకట్రామయ్య.

"సరె సర్లే, ఇంక గొణగడం ఆపేసి ఇదిగో ఇక్కడ సంతకం పెట్టు" అంటూ ఓ కాగితం ఇచ్చాడు.

"కొంచెం 'ఇంటూ' మార్కు పెయ్యండి. లేకపోతే సరిగా ఎక్కడ పెట్టాలో అని చావదు" అన్నాడు వెంకట్రామయ్య.

"ఊఁ అది కూడా వుందా, ఎందుకయ్యా బాబూ మా ప్రాణాలు తీయడానికి కాకపోతే...ఊఁ ఇదిగో ఇక్కడ పెయ్యి" అంటూ ఆ కార్యక్రమం పూర్తయ్యాక కాగితాలు సర్దుతూ "మళ్ళీ మూడింటికి కనిపించండి" అన్నాడు శేషగిరి.

"అయ్యా, ఇప్పుడింకా పదకొండే నండీ...మరి..."

"చూడు...ఇక్కడ క్షణాల్లో పనవ్వడానికి కంప్యూటర్లు, రాబోట్లు లేవు. బయటెక్కడయినా కాలక్షేపం చేసి సాయంకాలం రా" శేషగిరి అన్నాడు విసుగ్గా.

అది పెన్షనర్లకి జీతాలిచ్చే ఆఫీసు. భావిభారత పౌరుల్ని తీర్చిదిద్ది, వయసయిపోయింతర్వాత రిటైరయి చేసిన సేవకి ప్రతిఫలం అందుకునే మేష్టార్లు, శత్రువుల్ని చీల్చి చెండాడి అలసిపోయిన మిలిటరీ జవాన్లు, దేశాన్ని రక్షించడంలో వీర మరణం పొందిన జవానుల వితంతువులు...ఆ ఆఫీసుకి నెల మొదటి వారంలో జేరుకుంటారు. దాదాపు అందరూ వయసుపై బడిన వారే. అదే శేషగిరి కోపానికి కారణం. ఒక్కొక్కరూ ముక్కుతూ మూలుగుతూ వస్తూంటే అతను భరించలేడు. వారంటే అతని కసహ్యం. వాళ్ళెందుకూ పనికి రారనే తేలిక భావన.

ఒక్క వెంకట్రామయ్యే కాదు...శేషగిరి దృష్టిలో అందరూ వెంకట్రామయ్యలాంటి వాళ్ళే!...

"ఎంత లోకువయిపోయింది బతుకు!" ఉసూరుమంటూ బెంచీమీద కూర్చుంటూ అన్నాడు వెంకట్రామయ్య.

"అంతే లెండి. వాళ్ళిచ్చే వాళ్ళు, మనం పుచ్చుకొనే వాళ్ళం. ఆమాత్రం అజమాయిషీ వుండొద్దూ" అన్నాడు రిటైరయిన ఇంకో టీచరు. అక్కడ కూర్చున్న వాళ్ళందంతా అదో ప్రపంచం. వాళ్ళకి ఉద్రేకాలు పనికిరావు. ఆవేశాలు ఉపయోగపడవు. కోప తాపాలు కుదరవు. చుట్టుపక్కల ఊళ్ల నుంచి పది గంటలకల్లా ఆఫీసుకి చేరుకుంటారు. ప్రభుత్వం తరఫున వచ్చే పెన్షను ఎక్కువైనా, తక్కువైనా దానితో సంబంధం లేకుండా సంతోషిస్తారు. దానిక్కారణం వారీతరం వారు కాదు. చిత్తశుద్ధితో పనిచేసిన వాళ్ళు. పదకొండు గంటలకల్లా ఇవ్వవలసిన కాగితాలు పుస్తకాలు ఇచ్చేసి ఈసురోమంటూ సాయంకాలం మూడు నాలుగు గంటలవరకూ కాలక్షేపం చేస్తారు. ఇంతకంటే గొప్ప జీవితం వాళ్ళ ఇంటి దగ్గర వుందని కాదు, ఇంతకంటే రోజూ ప్రత్యక్ష నరకం చూస్తున్న వాళ్ళు కూడా వున్నారు!

ప్రొద్దున్నుంచీ సాయంకాలం వరకు సాగే ఈ నిరీక్షణలోనే తమ బాధలు, ఆలోచనలు ఇతరులకి చెప్పకొనే గొప్ప అవకాశాన్ని ఆ ఆఫీసు కల్గిస్తోంది.

"ఏమోనండీ వెంకట్రామయ్యగారూ, ఈ జీవిత పరమార్థం ఏమిటో కన్పించడం లేదు. నా కొడుక్కి నేనంటే లక్ష్యం లేదు. కోడలు సరేసరి. అయితే ఒక్క మాట, ఈ రోజున మాత్రం ఇంటికెళ్ళగానే కాఫీ, టిఫిన్, ఆనక భోజనం...అంతా బ్రహ్మాండంగా సాగుతాయి. చిక వాళ్ళ పిల్లల్ని...పంపించి అసలు మంత్రం వేయిస్తారన్న మాట!" వెంకట్రామయ్యకి పక్కన కూర్చున్న అవధానిగారన్నారు.

"మరి ఆ మొత్తం ఇచ్చేస్తారా?"

"చూడండి, ఏం చేస్తాం. అవునన్నా కాదన్నా తిండి గింజలు పెట్టేది ఆ కొడుకే కదా. వాళ్ళు నా మనవలే కదా! అందుకని ఏం చేస్తాం, ఇచ్చేస్తాను. గమ్మత్తేమిటంటే ఆ మర్నాటి నుంచి, మళ్ళీ ఈ రోజు వరకూ...ఎందుకు లెండి చెప్పడం" అంటూ నవ్వారు అవధానిగారు. అందులో వున్న బాధని అర్థం చేసుకున్నాడు వెంకట్రామయ్య.

"అంతే లెండి అవధానిగారూ. కొంచెం అటూ ఇటూగా నాదీ అదే కథ" నిట్టూర్చాడు వెంకట్రామయ్య.

ఆ పక్కనే ఇంకో బెంచీ మీద కూర్చున్న కమలమ్మగారు సంభాషణంతా వింటున్నారు. ఆమె మనసు పరిపరి విధాల పోతూంది. తనకి మిలిటరీ పెన్షన్. భర్త తరుఫున వస్తుంది. ఏడుగురు సంతానం. ఈ వయస్లో అటొక ఊరు, ఇటొక ఊరు వెళ్ళిపోయాక ఒక్కతే ఇంట్లో వుంటుంది. ఏడుగుర్లో ఆడ సంతానం కాపురాల్లో మునిగిపోయినా, నలుగురు కొడుకుల వరస మరీ విడ్డూరంగా వుంటుంది. అందరికీ పెళ్ళిళ్ళయి ఎవరికి వారే వుంటున్నారు. ఏ

ఒక్కరూ డబ్బు పంపరు. ఉత్తరాల్లో ఆ సంగతి ఎత్తరు. కాని పొరపాటున స్వగ్రామం జేరితే జన్మనిచ్చిన తల్లిని ఒక్క క్షణం విడవరు. ఇంకోరకంగా చెప్పాలంటే ఆమె దగ్గరున్న ఒక్క పైసాని కూడా వదలరు. ఆ తర్వాత తుఫాను వచ్చినా, ఉప్పెన ముంచెత్తినా ఎవరి ఊర్లో వాళ్ళే వుంటారుగాని మళ్ళీ 'తల్లి' ఊసు ఎత్తరు. అందుకే కమలమ్మగారు ఏ కొడుకు దగ్గరా వుండదు. ఉన్నదాంట్లో వండుకు తిని వుంటుంది. అన్నీ ఆలోచిస్తున్న కమలమ్మ కళ్ళల్లోంచి ఆమెకు తెలియకుండానే నీరు వరదలౌతోంది. అది గమనించిన అవధాని, వెంకటాచలమయ్యలు అటువంటి పరిస్థితిలో మౌన రోదనే మనసుని తేలిక చేస్తుందనే అనుభవం గడించి వుండడంవల్లఊరుకుండి పోయారు. ఆ వరండాలో కొంచెం అటూ, ఇటూగా అందరి మనసుల్లోను అదే వేదన, అదే మౌన రోదన!

అదే సమయంలో...పైన మేడ మీద ఆఫీసు స్టాఫ్ లంచ్ చేస్తున్నారు.

"అబ్బబ్బ, ముసలి సంతలో చచ్చే పనవుతోంది రామారావ్. ఒకడు సంతకం సరిగా చేయలేడు, ఇంకొకడికి సరిగా చూపు ఆనదు. ఇంకొకడు లోపలికి వచ్చేసరికి 'శెట్టి సింగారించే' టైమవుతుంది. లేనిపోని ఆఫీసులో పడ్డాను బాసూ" శేషగిరి అన్నం తింటూ అన్నాడు.

"కొంచెం ఓపిక పట్టవోయ్ శేషగిరి. నెల మొదటి వారంలోనే కదా నీకీ రొంపి. ఆ తర్వాత వుండదు కదా" రామారావన్నాడు.

"ఈ వారంలోనే నా ఊపిరాగిపోతుంది గురూ! అయినా నాకొకటి అర్థం కాదు. వాళ్ళకేదో పెద్ద మొత్తాలు ఒరిగి పోయినట్టు, ఇక్కడికొచ్చి పడ్తారెందుకు-పట్టుమని ఓ వెయ్యి కూడా రావు కదా! ఆ మాత్రం దానికి అపురూపంగా లెక్కెట్టుకుంటూ వెళ్తారు. ఫ...ఫసిమనుషులో ఏమిటో" శేషగిరీ అన్నాడు.

"ఇదిగో శేషగిరీ, అవన్నీ వదిలెయ్యిగానీ, నీకేవన్నా బాగా కిడులోందా...అంటే ఆమ్యామ్యా" గుర్నాథం అన్నాడు.

"ఆ అలా అడుగు చెప్తాను. ఎప్పుడన్నా ఏవన్నా ఎరియర్స్ వచ్చాయనుకో, మేష్టార్లు కదా కుర్రాళ్ళకి లెక్కలు చెప్పినట్టే లెక్కెడతారు. ఈ 'కట్' ఏమిటి? ఆ 'తగ్గింపేమిటి' అని ప్రశ్నల పరంపర. ఇక మిలిటరీ పెన్షనర్లు, 'మొన్న ఢిల్లీలో సెంట్రల్ గవర్నమెంటు... అంటూ థియరీ మొదలెడతారు. చెప్పక పోవడమేంటిగాని ఏదో కిడతాయిలే. ముక్కున్నా, మూలుక్కున్నా మన వాటా మనకొచ్చేస్తుందిలే" శేషగిరి భోజనం ముగించాడు.

"మరింకేవయ్యా. మనక్కావల్సింది అదేకదా. కానియ్, కానియ్. లంచ్ టైమయిపోయింది" గుర్నాథం అన్నాడు.

"ఆ! పోనీయండి, ఓ గంట 'స్లిప్' కొడ్తేనేగాని మనం మళ్ళీ దార్లోకి రాము. తర్వాత తీరిగ్గా వాళ్ళ సంగతి చూడొచ్చు. అయినా ఈ వేళ జీతాలు తీసుకోడానికే కదా వాళ్ళొచ్చారు. మరింకేం ఉంటారు" అంటూ పక్కనే వున్న పడక్కుర్చీలో బిచాణా వేసాడు.

ఆ సాయంకాలానికి ఉసూరుమంటూ, కళ్ళు తిరుగుతూ, వళ్ళు తూలుతూ పెన్షనర్లు ఒక్కొక్కరే డబ్బు తీసుకున్నారు.

* * *

మరో నెల గడిచింది. ఎప్పటిలాగే మొదటి వారంలో పెన్షనర్లు చీమల పుట్టలా చేరారు. వాళ్ళలో కొత్తవారు పరంధామయ్య. మేష్టారుగిరీ చేసి ఈ మధ్యనే రిటైరయ్యాడు. ఉదయం పదకొండు గంటలకి ఇవ్వాల్సిన పుస్తకాలు అందరూ ఇచ్చేసారు. వాళ్ళలో చివరి వాడు పరంధామయ్య.

"ఇదే తీసుకోవడమేమో కొత్తగా" శేషగిరి అన్నాడు.

"అవును సార్ మొన్ననే రిటైరయ్యాను" పరంధామయ్య అన్నాడు.

"కొత్తగాబట్టే అవీ ఇవీ పూర్తిచేయడానికి లేటవుతుంది కదా. కొంచెం తొందరగా రావచ్చు కదా" శేషగిరి అన్నాడు.

"అది కాదండీ"...ఇంకా ఏమో చెప్పబోతున్నాడు పరంధామయ్య.

"ఆఏది కాదు! కోడలు అన్నం లేటుగా పెట్టింది, పిల్లలు ఒక్కంతట రానివ్వలేదు, బయల్దేరే సరికి కూతురు సరుకులు తీసుకు రమ్మంది, లేపోతే దార్లో దగ్గుకి మందులు కొనుక్కున్నాను...ఇవేగా కారణాలు, ఇవిగాకపోతే ఇలాంటిది మరొకటి" ఎప్పుడూ అందర్నీ అన్నట్టే అన్నాడు శేషగిరి.

పరంధామయ్య చలించ లేదు. ఆ కళ్ళల్లో ప్రాధేయపడే చూపు లేదు. నిశ్చలంగా వున్నాడు. ఓ నిముషం ఆగాడు. శేషగిరిని నిశితంగా చూస్తూ,

"చూడండి మిస్టర్! మీరన్నీ మాటలనడానికి నేనేం తప్పుచేయలేదు. ఈ వేళ రావడం మా హక్కు. ఇవ్వడం మీ విధి. మీరు అంత త్వరగా పనిచేసే వారయితే సాయంకాలం అయిపోతుందేం డిస్బర్స్‌మెంటు జరగడానికి? మీ కళ్ళకి మేం పనికిరానివాళ్ళం కావచ్చు. మీరు భావిస్తున్నట్టు మేం ఎందుకూ ఉపయోగపడని వాళ్ళమే. అయితే ఇంతకు ముందు సర్వీసులో ఉన్నప్పుడు మాలో ఎంత మంది ఎంత మందిని భావి పౌరులుగా తీర్చి దిద్దారో తెల్సా? ఎంత మంది ప్రాణాలకు తెగించి దేశ రక్షణకు బలైపోయారో తెల్సా? మేం చేసిన త్యాగాలు, పనులూ ఇప్పుడు మీకు తెలియక పోవచ్చు. మా శరీరాలు క్షీణించి, చేతులు, కాళ్ళు మరలు అరిగిపోయి వుండొచ్చు. మా జీవితాలు ఎప్పుడైనా ముగిసి పోవచ్చు. మావి ప్రొద్దుగుంకిన పడమర జీవితాలు కావచ్చు. కాని మేం ఎన్ని 'పొద్దుల్ని' పొడిపించామో తెల్సా?" ఒక్క క్షణం ఆగాడు పరంధామయ్య. శేషగిరి నిశ్చేష్టుడై పోయి వున్నాడు. బయట ఉన్నవాళ్ళంతా చుట్టూ చేరారు.


"చూడు మిస్టర్, మేం ఇప్పుడు శక్తి ఉడిగిన వారం కావచ్చు. గతంలో వయసులో ఉన్నప్పుడు మేమూ నీలాగ శరీర దారుఢ్యంతో వున్న వాళ్ళమే. ఒక్కటి గుర్తుంచుకో-మేము నీ వయసులోకి రాకపోవచ్చు. కాని నువ్వు ఒక నాటికి తప్పక మా వయసుకి వచ్చి తీరతావు. అప్పుడు నిన్ను నీ వాళ్ళు చూడక నువ్వు పెన్షను తీసుకొనే ఆఫీసు వాళ్ళు నిన్ను హేళన చేసినప్పుడు, అప్పుడు తెలుస్తుంది. నాకంటే చాలా చిన్నవాడివి. అయినా పెద్దవాడ్ని అడుగుతున్నాను. నీ ఆఫీసుకి వచ్చి నిన్ను గద్దిస్తున్నందుకు విచారిస్తున్నాను-క్షమించు" అంటూ ఆగాడు పరంధామయ్య.

అక్కడ నిశ్శబ్దం ఏలుతోంది. ఎవ్వరూమాట్లాడ్డం లేదు. శేషగిరి గొంతు ఎండుకు పోయింది.


* * *

మరొక నెల గడిచింది...పెన్షన్ ఆఫీసు దగ్గర అంతా చేరారు.

"వెంకటాచలమయ్యగారూ" అని సౌమ్యంగా లోపల్నుంచి పిలిచిందో కంఠం. నమ్మినా, నమ్మక పోయినా ఆ కంఠం శేషగిరిదే!



రాజమండ్రి జేసీ రెడ్స్ వారి పోటీలో తృతీయ బహుమతి రూ 100 -లు పొందిన చిత్రలేఖనం



రాజమండ్రి జేసీ రెడ్స్ వారి పోటీలో కన్సొలేషన్ రూ 50 - బహుమతి పొందిన చిత్రలేఖనం

బహుమతులు అందజేస్తున్నవారు చందన కంచిశారీస్- లేడీస్ అండ్ జంట్స్ షోరూమ్ కోటగుమ్మం దగ్గర:రాజమండ్రి